క్లుప్తంగా

నేడు ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఆర్డీవో మల్లిబాబు, ఐసీడీఎస్ అధికారులు

కొవ్వూరు: గోపాలపురం, కొవ్వూరు, పెరవలి ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెండు కార్యకర్తల పోస్టులతో పాటు 24 హెల్పర్ల పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు జరిగాయి. కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఆరు ఆయా పోస్టులకు తొమ్మిది మంది, పెరవలిలో రెండు కార్యకర్తల పోస్టులకు ఎనిమిది మంది, 11 ఆయా పోస్టులకు 23 మంది, గోపాలపురంలో ఏడు ఆయా పోస్టులకు 28 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.ఆర్డీవో ఎస్.మల్లిబాబు సారథ్యంలోని ఐసీడీఎస్ జిల్లా అధికారి (పీడీ) కె.విజయకుమారి, సీడీపీవోలు డి.మమ్మీ, వైబీటీ సుందరి, ఎం.శ్రీలక్ష్మి, పీపీ యూనిట్ వైద్యురాలు ఎ.మౌనికలతో కూడిన కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆర్డీవో మల్లిబాబు చెప్పారు.

'ఉజ్వల'తో రూ.100 కే గ్యాస్ కనెక్షన్

పెరవలి: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఉజ్వల పథకం ద్వారా కేవలం రూ.100 తో గ్యాస్ కనెక్షన్ పొందవచ్చని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి చెప్పారు. విజిలెన్స్ మండల నూతన కార్యవర్గం సమావేశం మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండి, స్థానికులై ఉండి, గతంలో గ్యాస్ కనెక్షన్ లేని వారు ఈ పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొందేందుకు అర్హులన్నారు. ఉజ్వల కనెక్షన్ తీసుకున్నవారికి ఉచితంగా సిలిండర్, స్టౌవ్, పైప్, రెగ్యులేటర్ అందిస్తారన్నారు. అర్హత కలిగిన వారు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు. విజిలెన్స్ కమిటీ సభ్యుడు పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్నవరప్పాడులో రేషన్ డిపోను సొసైటీకి కేటాయించాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ మాట్లాడుతూ ఈ విజిలెన్స్ కమిటీ ప్రతి మూడు నెలలకోసారి సమావేశం అవుతుందన్నారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు ప్రతి గ్రామంలో రేషన్ డిపో వద్ద వినియోగదారులకు అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు.

పటేల్‌కు నివాళిగా ఐక్యతా దినోత్సవం



నల్లజర్ల మండలం దూబచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల మానవహారం

నల్లజర్ల: భారత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా దూబచర్ల హైస్కూల్లో విద్యార్థులు జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పాటించారు. ఈ సందర్భంగా హెచ్ఎం బి.సుమతి అధ్యక్షతన వారు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పాఠశాల పీడీ దూబగుంట్ల రాజారావు ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతను ప్రతిబింబేలా విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే నల్లజర్ల శాఖా గ్రంథాలయంలోనూ విద్యార్థులు ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. అలాగే మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు.విద్యార్థులు, పాఠకులు, గ్రంథ పాలకురాలు ఏవీ రమణ పాల్గొన్నారు.

రామప్రసాద్‌కు ఉద్యోగ సేవారత్న పురస్కారం

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగికి చెందిన కోట రామప్రసాద్‌కు ఉద్యోగ సేవారత్న పురస్కారం లభించింది. ఆయన ఉండ్రాజవరం జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్. తాడేపల్లిగూడెంకు చెందిన రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆదివారం రాత్రి రామప్రసాద్‌ను సత్కరించింది. ఈ సందర్భంగా రామప్రసాద్ మాట్లాడుతూ రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఇప్పటి వరకూ పేద కళాకారులకు రూ.87 లక్షల ఆర్థిక సాయం చేసిందన్నారు. దేశం సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడు లక్షలాది రూపాయలు చందాలు వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేసిందన్నారు. ఇటువంటి సామాజిక చైతన్యం, బాధ్యత, కళాభిమానం గల ఈ సంస్థ తనను సత్కరించడం సంతోషంగా ఉందన్నారు.

సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పలు గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు
- వేలాది మందికి ఉచితంగా వైద్యం



నిడదవోలు మండలం సింగవరంలో వృద్ధురాలికి మెడికల్ కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సింగవరంలో మంగళవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన రోగులకు మెడికల్ కిట్లు, వృద్ధులకు కళ్లజోళ్లు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. సమిశ్రగూడెం పీహెచ్‌సీ వైద్యులు ఎ.అమరేంద్ర పర్యవేక్షణలో ఆరుగురు స్పెషలిస్ట్ వైద్యులు 412 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెన్మెత్స వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీటీసీ సభ్యురాలు పెన్మెత్స నిర్మల, సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు, ఉప సర్పంచ్ రామరాజు, జగదీష్ వర్మ, ఎంపీడీఓ పి.శామ్యూల్, కార్యదర్శి కేవీ సుబ్బన్న పాల్గొన్నారు.

జగన్నాథపురంలో 170 మందికి..

గోపాలపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరం వంటివని, వాటిని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. మండలంలోని జగన్నాథపురం సచివాలయం వద్ద మంగళవారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. అన్నదేవరపేట, గోపాలపురం, హుకుంపేట ఆసుపత్రుల వైద్యులు సుమారు 170 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఎమ్మెల్యే వెంకట్రావు చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైస్ ఎంపీపీ వంగా నారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, నాయకులు ఎస్కే వల్లీ, వంగా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో రోగులకు మందులు అందిస్తున్న జెడ్పీటీసీ భాస్కరరామయ్య



చాగల్లు మండలం చిక్కాలపాలెంలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

వేలివెన్నులో 451 మందికి..

ఉండ్రాజవరం: వేలివెన్ను–3 సచివాలయం పరిధిలోని సొసైటీ వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. వేలివెన్ను పీహెచ్‌సీకి చెందిన ఎస్‌జీ ఇర్ఫాన్ (జనరల్ మెడిసిన్) ఆధ్వర్యంలో ఉషాదేవి (జనరల్ సర్జన్), వనిత (ఎంఎస్), నాగేశ్వరరావు (ఎండీ ఫిజీషియన్)లు శిబిరంలో 451 మందికి వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. శిబిరానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య రోగుల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ బ్రహ్మానందం, ఎంపీటీసీ సభ్యురాలు మల్లిపూడి పాప, ముళ్ళపూడి కేశవరావు, ఎంపీడీవో జీఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

చిక్కాలపాలెంలో 270 మందికి..

చాగల్లు: మండలంలోని చిక్కాలపాలెం మండల పరిషత్ పాఠశాలలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, సర్పంచ్ కొయ్యే మణి శిబిరాన్ని సందర్శించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఆర్థోపెడిక్, డెంటిస్ట్, జనరల్ అండ్ గైనిక్, ఆప్తమాలజీ విభాగాల వైద్యుల బృందం 270 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులను పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు, ఎంపీడీవో బి.రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎస్కే ఖాసిం, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లులో గడప గడపకూ..



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లు–2 సచివాలయ పరిధిలో మంగళవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతినెలా పింఛన్లను క్రమం తప్పకుండా ఒకటో తేదీన ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అందజేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్ష,అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఉప సర్పంచ్ మేకా రాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఉన్నమట్ల విజయకుమారి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలవెల్లువలో రైతులు భాగస్తులు కావాలి



గోపాలపురంలో జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

గోపాలపురం: జగనన్న పాలవెల్లువ పథకంలో మహిళా రైతులతో పాటు రైతులు కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. గోపాలపురం సచివాలయం వద్ద మంగళవారం పాలవెల్లువ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ మహిళా రైతులు ముందుకొచ్చి పాడి గేదెల పెంపకాన్ని చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ఎస్‌కె వల్లీ, ఎంపీటీసీ సభ్యురాలు వార సంగీత, వైస్ ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిని పెంచాలి

నల్లజర్ల: అన్ని గ్రామాల్లోనూ పాల ఉత్పత్తిని పెంచాలని ఎంపీడీఓ రాజశేఖరం మహిళా సంఘాలకు సూచించారు. జగనన్న పాలవెల్లువ పథకంపై మంగళవారం మహిళా సంఘాల ప్రతినిధులతో మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పాలవెల్లువ కింద అమూల్ సంస్థ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. పాడిగేదెల కొనుగోలుకు రుణ సహాయం అందించడానికి డీఆర్డీఏ, సహకార సంఘాలు, బ్యాంకులు ముందుకు వస్తున్నాయని చెప్పారు. వాటిని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవంబరు నెలాఖరుకు 500 గృహ నిర్మాణాలు

నవంబరు నెలాఖరు నాటికి మండలంలో 500 జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీడీఓ రాజశేఖర్ సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సూచించారు. అన్ని లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులపై కూడా సమీక్ష జరిపారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వినోద్‌కుమార్, అజయ్‌బాబు ఉపాధి హామీ ఏపీఎం రమణ, పశుసంవర్ధక శాఖ ఏడీఏ జాన్‌మోజెస్ వెస్లీ పాల్గొన్నారు.

కొత్త వ్యవస్థలతో పాలన పల్లెబాట

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పెరవలి, కొత్తపల్లి అగ్రహారాల్లో ప్రారంభోత్సవాలు



పెరవలిలో రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలనను పల్లె బాట పట్టించారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పెరవలి, కొత్తపల్లి అగ్రహారం గ్రామాల్లో కొత్తగా నిర్మించిన నిర్మాణాల ప్రారంభోత్సవాల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. తొలుత పెరవలిలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాన్ని, రూ.3.50 లక్షలతో నిర్మించిన కల్వర్టును ప్రారంభించారు. అలాగే కొత్తపల్లి అగ్రహారంలో రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇప్పటి వరకూ రూ.6 కోట్ల వ్యయంతో పెరవలి గ్రామంలో రోడ్లు, డ్రైన్లు, నూతన భవనాల వంటి అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. అలాగే గత నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.15 కోట్ల మేర ఈ గ్రామస్తులకు లబ్ధి చేకూర్చామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు తెలుగుదేశం, జనసేన పార్టీల తీరుపై ధ్వజమెత్తారు. పొత్తు పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో కలసి పోటీ చేస్తామని ఈ రెండు పార్టీలూ చెప్పుకుంటున్నా, గత పదేళ్లుగా ఈ రెండు పార్టీలు కలిసే ఉన్నాయన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర వెలమ, ఇరిగేషన్ కార్పొరేషన్ల డైరెక్టర్లు బుజ్జి, దొడ్డిగర్ల స్వాతి, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ గంగోలు సీతమ్మ, జోసెఫ్, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు రాపాక ప్రమీల, పలువురు పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గోరుముద్ద అమలుపై ప్రత్యేక శ్రద్ధ

- గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు
- దేవరపల్లి హైస్కూల్‌కు వంట పాత్రల అందజేత

దేవరపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా వంట ఏజెన్సీలకు ప్రభుత్వం వంట పాత్రలను సరఫరా చేసింది. ఈ పాత్రలను మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీలక్ష్మికి ఎమ్మెల్యే వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రతి ప్రభుత్వ పాఠశాలకూ ప్రభుత్వం వంట పాత్రలను సరఫరా చేసిందన్నారు. దేవరపల్లి మండలంలోని 45 పాఠశాలలకు వంట పాత్రలను అందజేసినట్టు తెలిపారు. ఎంఈవోలు తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు మాట్లాడుతూ మండలంలో 30 మంది విద్యార్థులున్న పాఠశాలలు 16, 31 నుంచి 50 మంది గల పాఠశాలలు 7, 51 నుంచి 150 మంది విద్యార్థులున్న పాఠశాలలు 9, 151 నుంచి 250 మంది గల పాఠశాలలు 5, 250 నుంచి 400 మంది విద్యార్థులున్న పాఠశాలలు 4, 400 మంది పైబడి విద్యార్థులున్న పాఠశాలలు 4 ఉన్నట్టు వివరించారు. నాణ్యమైన వంటపాత్రలను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, పలువురు పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం శ్రీలక్ష్మికి వంట పాత్రలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

వల్లభాయ్ పటేల్ ఐక్య వారోత్సవాలు

కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్య వారోత్సవాల సందర్భంగా జెడ్పీ హైస్కూల్ వద్ద వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి నాదేశం యొక్క ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడడానికి నాకు నేనుగా అంకితమవుతానంటూ ఎమ్మెల్యే వెంకట్రావు ప్రతిజ్ఞ చేశారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌పై టీడీపీ దాడి

నిడదవోలు: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఉండ్రాజవరం మండల కన్వీనర్ ఆరేపల్లి వెంకటేష్‌పై సోమవారం టీడీపీ నాయకులు దాడి చేశారు. మండలంలోని కాల్దారిలో సెల్ షాప్ నిర్వహిస్తున్న వెంకటేష్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నాయకుల తీరును వెంకటేష్ ఖండిస్తూ వస్తున్నారు. దీంతో సుమారు 50 మంది టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా వెంకటేష్ సెల్ షాపుపై దాడి చేశారు. విచక్షణ రహితంగా కొట్టారు. గాయపడిన వెంకటేష్ తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉండ్రాజపురం ఎస్సై కె. రామారావు 20 మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అట్లతద్దె పండుగ

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అట్లతద్దె పండగను మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. కొత్తగా వివాహాలు అయిన మహిళలతో ముత్తైదువలకు వాయనాలు ఇప్పించారు. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. సాయంత్రం చెరువుల వద్ద, కాలువల వద్ద మహిళలు అట్ల తద్దె పూజ నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాసం ఉన్న మహిళలు రాత్రి నక్షత్రాలు కనిపించాక ముత్తైదువలకు వాయనాలు ఇచ్చి ఉపవాసాన్ని విరమించారు. ఉండ్రాజవరం, మోర్త, పాలంగి, పసలపూడి, వేలివెన్ను, చివటం, కె.సావరం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఊయలలో మహిళలు ఉత్సాహంగా ఊగారు.

గ్యాస్ సిలిండర్ లీకై వృద్ధురాలికి గాయాలు

తాళ్లపూడి: గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. మండలంలోని పైడిమెట్ట గ్రామంలోని బరిగంటి లక్ష్మి అనే వృద్ధురాలి ఇంట్లో మంగళవారం రాత్రి ఈ ప్రమాదం సంభవించింది. వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు సకాలంలో స్పందించి నీటితో మంటలను ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. గ్యాస్ సిలిండర్‌కు సక్రమంగా సీల్ వేయకపోవడంతో పాటు పాత వాటిని సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

ఉండ్రాజవరం: వెనుకబడిన కులాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీసీ జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తాడిపర్రు గ్రామంలో మంగళవారం వెన్నపు సుధాకర్ అధ్యక్షతన బహుజన ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బహుజన నాయకుడైన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని నెలకొల్పుతుంటే తమ స్వార్థం కోసం రాజకీయ నాయకులు కుట్రపూరితంగా చిచ్చు పెట్టారన్నారు. కార్యక్రమంలో బీసీవై పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ అత్తిలి రాజు, సామాజికవేత్త చిర్రా గోపాల్, మహిళా నాయకురాలు మార్గాని సుశీల, రాష్ట్ర గౌడ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు పచ్చజెండా

- అజెండాలోని 25 అంశాల ఆమోదం
- నిడదవోలు మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మున్సిపల్ సాధారణ, అత్యవసర సమావేశాలు మంగళవారం చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సాధారణ సమావేశంలో అజెండాలోని ఆరు, అత్యవసర సమావేశంలో 18 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ రూ.కోట్లాది నిధులతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. విపక్ష కౌన్సిలర్ గారింకి నాగేశ్వరరావు మాట్లాడుతూ మెప్మాలో రూ.1.90 లక్షల మేర అవినీతి జరిగిందన్నారు. ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ స్పందిస్తూ మెప్మాలో అవకతవకలు జరగడం వాస్తవమే అని, సంబంధిత ఆర్పీని తొలగించాలని ఇప్పటికే మెప్మా పీడీ ఆదేశాలు ఇచ్చారని బదులిచ్చారు. మెప్మా మేనేజర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడిన ఆర్పీని ఉద్యోగం నుంచి తొలగించి ఆమె నుంచి రూ.1.90 లక్షలు రికవరీ చేశామన్నారు.

ఆమోదించిన ప్రధానాంశాలు

స్థానిక యర్నగూడెం రోడ్డులోని మెడ్ ప్లస్ మెడికల్ షాప్ నుంచి గణపతి సెంటర్ వరకూ రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ.15 లక్షలతో రైల్వే ఆర్‌వోబీ సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకూ డివైడర్లకు గ్రానైట్ క్లాడింగ్‌కు ఆమోదం తెలిపారు. అలాగే ఎల్‌హెచ్ఎం రోడ్డులో రెండు వైపులా డ్రైన్, కల్వర్టుల ఎత్తు పెంచుట, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ. 27 లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. ఎల్ హెచ్ఎం రోడ్డుకు రెండువైపులా ఉన్న డ్రెయిన్ కవర్ శ్లాబ్‌లు నిర్మాణానికి రూ. 9.30 లక్షలు కేటాయించారు. ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తూ మరణించిన ఐదుగురి పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు రూ.రెండు లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నిడదవోలు మునిసిపాలిటీ ఏర్పడి 60 ఏళ్లయిన సందర్భంగా కార్యాలయ ఆవరణలో రూ.8 లక్షలతో స్తూపం నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గణేష్ చౌక్ నుంచి గణపతి సెంటర్ వరకూ ఎల్ హెచ్ ఎం సిమెంటు రోడ్డుకు పడమర వైపున ఇంటర్ లాకింగ్ టైల్స్ వేయడానికి రూ. 24 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ కాంటాక్ట్ ప్యానెల్ కమిటీలను మరో ఏడాది పొడిగిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది.

కాంటాక్ట్ కమిటీలో చైర్మన్ భూపతి ఆదినారాయణ, షేక్ వజురుద్దీన్, చిలకల శారదాదేవి, మానుపాటి లక్ష్మి, మేడపాటి సరిత, బిర్రే పార్వతి, కొత్తపల్లి సుప్రియ, గుర్రం శాంతిశ్రీ కొనసాగుతారు. ఈ కమిటీలో పువ్వుల రతీదేవి, ఆలమూరు భారతి, ఆరుగొల్లు వెంకటేశ్వరరావు, ఎండీ షకీరా బేగం, పిట్టా పద్మావతి, ఉసురుమర్తి జాన్‌బాబు, ముంగండి మాణిక్యమాల కమిటీలు కొనసాగుతున్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

దేవరపల్లి: దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని సారా తయారీ కేంద్రాలపై ఎస్ఈబీ, పోలీసు శాఖల అధికారులు మంగళవారం ఉమ్మడిగా దాడులు చేశారు. ఈ దాడులకు సారథ్యం వహించిన ఎస్ఈబీ దేవరపల్లి సీఐ డి.సుధ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపాలపురంలో సబ్బుల శ్రీను, కోమటికుంటకు చెందిన చుక్కా సుబ్బారావు అనే వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1,300 లీటర్ల బెల్లపు ఊట, 20 లీటర్ల సారా, మూడు అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. దేవరపల్లి మండలం లక్ష్మీపురంలో పాకా సతీష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 400 లీటర్ల బెల్లపు ఊట, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఇదే గ్రామంలో నాలుగు మద్యం సీసాలు కలిగి ఉన్న రాపాక జ్యోతిని అరెస్ట్ చేసి, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు.

పది లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: తాళ్లపూడి మండలం పోచవరం గ్రామానికి చెందిన మటపర్తి పుల్లారావు అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. నిందుతుడ్ని కొవ్వూరు కోర్టులో హాజరు పరిచామన్నారు.